క్లుప్తంగా

ఇంటింటికి వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



పెదకూరపాడు: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బాధితుల ఇంటికి వెళ్లి మంగళవారం అందజేశారు. అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన అమరనేని శ్రీనివాసరావుకు రూ.3.70 లక్షలు, క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన పోట్లపల్లి అప్పిరెడ్డికి రూ.1.70 లక్షలు, అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన పోసాని కుమారస్వామికి రూ.3.70 లక్షలు, పెదకూరపాడు మండలం 75 త్యాళ్ళూరుకు చెందిన ములకా లక్ష్మారెడ్డికి రూ.1.80 లక్షలు, కంభంపాడు గ్రామానికి చెందిన బోంతా స్వాతికి రూ.85 వేలు, ధరణికోటకు చెందిన వట్టికుండ సీతారామయ్యకు రూ.60 వేల విలువైన చెక్కులను అందజేశారు.

ఉత్తమ ఎంఈఓకు ఘన సన్మానం



ముప్పాళ్ల: ఉత్తమ మండల విద్యాశాఖాధికారిగా అవార్డు పొందిన ఒంగోలు రాజు ను మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంఈఓగా ఎంపికై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరినాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ నేపథ్యంలో మండల విద్యావనరులకేంద్రంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని ఘనంగా సన్మానించారు. ఎంఈఓ-2 ఎం.సీతారామిరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిండ మార్పిడిపై అవగాహన



హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామంలోని ఆవుకు పిండమార్పిడి(ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్) చేసి తదపరి జరిపిన చూడి పరీక్షల్లో మగజాతిగా(పాజిటివ్)గా నిర్ధారణ అయినట్లు పశువైద్యులు మల్లయ్య మంగళవారం తెలిపారు. దీనిపై డాక్టర్ వివరాలు తెలుపుతూ గ్రామంలోని రైతు శ్రీరామినేని కృష్ణకు చెందిన ఆవుకు ఒంగోలు జాతి పిండం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. తదుపరి జరిపిన చూడి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిపారు. చూడి ఆవును పరిశీలించేందుకు సీఈఓ, ఏపీఎల్‌డీఏ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, గుంటూరు ఈఓ డీఎల్‌డీఏ డాక్టర్ డి.బాలకిరణ్, డీడీ(ఎస్ఆర్టీ) డాక్టర్ రామారావు, ఏడీ ఎస్ఆర్టీ డాక్టర్ సీహెచ్ నరసింహులు, డాక్టర్ కె.శివసాంబబాబు, డాక్టర్ వెంకట్రామయ్య, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



నరసరావుపేట రూరల్: క్రీడలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని డీఎస్పీ కె.వి.మహేష్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వలన జ్ఞాపకశక్తి పెరుగుతాయని, దీనివల్ల అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపా రు. విద్యార్థులు జీవితంలో ఎవరిమీద ఆధార పడకూడదన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండా లని హితవు పలికారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ సంపూర్ణమైన విద్యార్థి చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాలలో నైపుణ్యాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు డీఎస్పీ మహేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, కళాశాల స్పోర్ట్స్ కన్వీనర్ ఎల్.కృష్ణారెడ్డి, ఝాన్సీరాణి, ఐ.శ్రీధర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై బీరు సీసాతో దాడి

నరసరావుపేట టౌన్: వ్యక్తిపై బీరు సీసాతో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. మిట్ట బజారుకు చెందిన నీలం చక్రపాణి మద్యం సేవించేందుకు అరండల్‌పేటలోని ఆర్‌కే బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ అప్పటికే మద్యం సేవించి ఉన్న నక్కా గోపితో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో చక్రపాణిపై గోపి బీరు సీసాతో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని 108 సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా ఉండాలి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. అచ్చంపేట మండలంలోని ఓర్వకల్లు గ్రామానికి చెందిన 50 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. మండల కేంద్రమైన క్రోసూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేశారని చెప్పారు. కులం, మతం, పార్టీలు చూడకుండా అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధి చూసి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా వస్తున్నారని అన్నారు. గతంలో తాను ఏ ఇంటికి వెళ్లినా సమస్యలు చెప్పేవారని, అదే తాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వెళ్లి ఎప్పటికప్పుడు సమస్యలన్నీ పరిష్కరించటం జరుగుతుందని వివరించారు. అందుకే ఏ గడపకు వెళ్లినా, ఏ గ్రామానికి వెళ్లినా తనను ప్రజలు ఘనంగా ఆదరిస్తున్నారని చెప్పటానికి సంతోషిస్తున్నట్లు తెలిపారు. వచ్చే 2024 ఎన్నికల్లో మనందరం మరింత అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పొందేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకుందామన్నారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ గ్రామ కమిటీ ఇన్‌చార్జి కోట జోజయ్య, నాయకులు కొలకలూరి రవి, రవితేజ, భాస్కర్, శివ, గంగాధర్, సురేష్, నాగేష్, మణియ్య, సంత్యం, బాబు, దావీదు, గణేష, గురుస్వామి, ఏసుపాదం, నాగేశ్వరరావు, నరేంద్ర, మరియబాబు, యాకూబు, లచ్చయ్య, శేషు, సత్యం బాబు, ముగేష్, కోటయ్య ఉన్నారు.

కర్లపూడి సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన

అమరావతి: మండల పరిధిలోని కర్లపూడి జగనన్న కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అక్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు, చిలకా సాంబయ్య, మంచికలపూడి వీరరాఘవయ్య, అలా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

4న తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అంబటి



భవనాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: తహసీల్దార్ కార్యాలయ భవనం, నైపుణ్య శిక్షణ కేంద్రం సెప్టెంబర్ 4వ తేదీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారు. భవనాలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. ఎన్జీవోహోం రోడ్డు నుంచి తహశీల్దార్ కార్యాలయ రాకపోకలు సాగేలా ఏర్పాట్లును చేపట్టారు. అంతేగాక ప్రహరీ నిర్మాణం కోసం రూ.17.5 లక్షల నిధులను మంత్రి అంబటి రాంబాబు చొరవ తీసుకొని మంజూరు చేయించారు. త్వరలో ప్రహరీ పనులు ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణం త్వరిత గతిన పూర్తయ్యితే ప్రజలు అందుబాటులోకి వచ్చేది. కాని గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. వర్షాలు కురిస్తే వర్షపు నీరు కార్యాలయంలోకి ప్రవేశించి ఇటు ప్రజలు అటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు, అధికారుల ఇబ్బందులను క్షేత్ర స్థాయిలో గుర్తించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవతో యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు పల్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైఎస్ఆర్ సీపీ సత్తెనపల్లి మండలం కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, కోఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి పల్నాడు జిల్లా వాణిజ్యభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, తహసీల్దార్ ఎస్.సురేష్ నాయక్, కమిషనర్ కొలిమి షమ్మి పాల్గొన్నారు.

ఓటు తొలగింపు జాబితా పరిశీలన

- నియోజకవర్గ ఎన్నికల అధికారి రామచంద్రరావు
- ఇంటింటికి వెళ్లి తొలగించిన ఓట్లను వెరిఫికేషన్ చేసిన అధికారి



పెదకూరపాడులో తొలగించిన ఓట్లను తిరిగి పరిశీలిస్తున్న రామచంద్రరావు

పెదకూరపాడు: గత ఏడాది జనవరి నుంచి తొలగించిన ఓట్లును మళ్లీ బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి రామచంద్రరావు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ తహసీల్దార్లు, రాజకీయపార్టీ నేతలు, బీఎల్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలగించిన ఓట్లును మళ్లీ ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని, చేర్పులు, మార్పులు మళ్లీ వేరిఫికేషన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా రాజకీయపార్టీ నేతలు పలు అభ్యంతరాలను ఎన్నికల అధికారి ముందుకు తెచ్చారు. దీంతో తొలగించిన ఓటర్లు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు క్షమారాణి, పద్మవతి, జియా, సునీత పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సర్వే

ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గత జూన్ 15 నాటికి జీరో డోర్ నంబర్లతో 984 మంది ఓటర్లు, ఒకే ఇంట్లో 10 మంది కంటే పైన 624 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వాటిని ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వేలో భాగంగా బీఎల్వోలు పరిశీలన చేశారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివాసం ఉంటున్న వారికి వారి డోర్ నంబర్లను కేటాయించడం జరిగిందన్నారు. చనిపోయిన వారిని తొలగింపునకు ఫారం-7 ను దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. స్థానికంగా నివాసం ఉండని వారికి నోటీసు ఇచ్చి వారి ఇష్టం మేరకు తొలగించడం లేదా ఉంచడం జరుగుతుందని వివరించారు. ఒకే ఇంట్లో 10కి మించి ఎక్కువ ఓట్లు ఉంటే వారిని గుర్తించి ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి వారి ఓట్లు నిజమైతే వారికి తాత్కాలికంగా నోషనల్ ఇంటి నంబర్లు జారీ చేయడం జరిగిందన్నారు. వీటన్నింటినీ ఆన్‌లైన్‌లో మండలాల వారీగా నమోదు చేయాల్సి ఉందన్నారు. సర్వే ప్రక్రియ పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ఓటు నమోదుకు ఫారం-6లు 2,884, తొలగింపులకు ఫారం-7లు 1,812, మార్పులకు ఫారం-8లు 1,974 దరఖాస్తులు వచ్చాయన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలక మండలి సభ్యుడిగా నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్యను ఎంపిక చేయడం హర్షణీయమని పలువురు పేర్కొన్నారు. మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం మంగళవారం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షులు ఉంగుటూరు నిబద్ధి మాట్లాడుతూ దేవాలయాల్లో సేవకులుగా ఉన్న నాయీ బ్రాహ్మణులను దేవస్థాన పాలకులుగా మార్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతోందన్నారు.

కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు బంధం రావూరి రాజకుమార్, నాయకులు శ్రీనివాసరావు, శివప్రసాద్, హనుమంతు, వరప్రసాద్, వెంకటేశ్వరరావు, శివ నాగమల్లేశ్వరరావు, కృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల బకాయిలు చెల్లించాలి



వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సత్తెనపల్లి: భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని పల్నాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాద్ రావు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి తాము చేసే పోరాటానికి అన్ని రాజకీయ పార్టీల వారిని మద్దతు ఇవ్వాలని వారు కోరారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పట్టణ కన్వీనర్ వల్లెం నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు నాయక్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, షేక్ మహమ్మద్ గని, సెగ్గం వెంకటేశ్వరరావులను భవన నిర్మాణ కార్మికులు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 వ తేదీన మంత్రి అంబటి రాంబాబు వద్దకు భవన నిర్మాణం కార్మికుల సామూహిక రాయబారం కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తాము చేసే పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటా ఆంజనేయులు, పట్టణ కమిటీ సభ్యులు పెదాల శ్రీను పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలపై పోస్టర్ ఆవిష్కరణ



ఈపూరు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్యావిధానం) ఆధ్వర్యంలో 10వ తరగతి ఇంటర్‌మీడియెట్‌లలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల నిమిత్తం ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దూరవిద్యా విధానం ద్వారా చదువుకోవాలని ఆసక్తి ఉన్న వారు పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఈ సంవత్సరం ప్రవేశాలను పెంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎం.హుస్సేన్, కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో అన్నదానానికి విరాళం



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి మంగళవారం పలువురు భక్తులు రూ.72,187 విరాళాలు సమర్పించారు. ఆలయ ఈఓ గోపినాథ శర్మ మాట్లాడుతూ గుంటూరుకు చెందిన మన్నవ ఉమామహేశ్వరరావు, శివకుమారి దంపతులు రూ.50,116, విశాఖపట్నానికి చెందిన అల్లూరి వంశీకృష్ణ, జోషిత దంపతులు రూ.5,116, ధరణికోటకు చెందిన దండా నాగేంద్రకుమార్, అనుషా దంపతులు రూ.5,000, ప్రొద్దుటూరు వాస్తవ్యులు పి.రామకృష్ణ, లక్ష్మీదేవి దంపతులు రూ.3,002, ఇతర భక్తులు రూ.8,953 అందించినట్లు చెప్పారు.

అమ్మవారికి గాజుల అలంకారం..

బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో నిజ శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా బుధవారం అమ్మవారికి గాజుల అలంకారం నిర్వహించనున్నట్లు చెప్పారు.

బీమా నగదు అందజేత

ఊటుకూరు(క్రోసూరు): గ్రామంలో ఇటీవల మృతి చెందిన పెరుమాళ్లపల్లి చంద్రబాబు మృతి చెందగా మంగళవారం అతని భార్య పి.రాణికి వైఎస్సార్ బీమా నగదు (మట్టిఖర్చుల నిమిత్తం) రూ.10వేలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి జొన్నవరపు శ్రీనివాసరెడ్డి , గ్రామ సర్పంచి జెట్రిపోతు బుచ్చయ్య ఆధ్వర్యంలో అందించారు.

నేత్రదానంపై అవగాహన

అమరావతి: ప్రతి ఒక్కరికి నేత్రదానంపై అవగాహన అవసరమని అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రవిబాబు అన్నారు. మండల పరిధిలోని దిడుగు, లింగాపురంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

జగనన్న పాల వెల్లువతో మేలు

అచ్చంపేట: మహిళలు ఆర్థిక వనరులను మెరుగు పరచుకునేందుకు జగన్న పాలవెల్లువ ద్వారా అమూల్ పాల కేంద్రాలను గ్రామా గ్రామాన ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో రుణమేళా మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఓ షేక్ సలీం, పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణంలో వలంటీర్లదే ప్రధాన పాత్ర

అమరావతి: ఇళ్ల కార్యక్రమంలో వలంటీర్లు ప్రధాన పాత్ర పోషించి అధికారులకు సహకరించాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులు, వలంటీర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



నకరికల్లులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మి



సత్తెనపల్లిలో కవులు, కళాకారుల వేషధారణలో విద్యార్థులు

నకరికల్లు: మాతృభాష కమ్మనైనది, సులభతరమైందని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ కే లక్ష్మి అన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ స్పోర్ట్స్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష కోసం పోరాటం చేసి ఎన్నో సరళ తరమైన రచనలు కొనసాగించిన గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, యోగా విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషను చక్కగా నేర్చుకుంటే భవిష్యత్‌లో అవకాశాలకు కొదవలేదన్నారు. మాతృభాష జీవితంలో స్థిరపడేందుకు దోహ ద పడుతుందని పేర్కొన్నారు. మాతృభాష తెలుగుకు మరింత ఆదరణ పెరుగుతూనే ఉందన్నారు. ఈ సందర్భంగా క్రీడా ఉపాధ్యాయని కె.శివపార్వతి, తెలుగు ఉపాధ్యాయని రాజేశ్వరిలను ఘనంగా సన్మానించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పెదకూరపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్, మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రమణరావు మాట్లాడారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు గుత్తికొండ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు బాషా దినోత్సవం

అమరావతి: స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య పరిశోధకులు డాక్టర్ వావిలాల సుబ్బారావు, తెలుగు ఉపాధ్యాయులు శనగవరపు రామ్మోహన్ శర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అమరేశ్వరాలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథ శర్మ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మాతృభాషా దినోత్సవం , జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కవులు, కళాకారులుగా వేషధారణ ధరించి తెలుగు గొప్పతనాన్ని చాటి చెప్పారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి, తెలుగు ఉపాధ్యాయులు సత్యవతి, రుక్మిణి, జాబిలి, భాగ్యలక్ష్మి, పీఈటీలు ఎస్ అచ్చిరెడ్డి, రాజా పాల్గొన్నారు.

మిరప సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మాదల(ముప్పాళ్ల): రైతులు మిరప సాగు చేసే సమయంలో తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని సత్తెనపల్లి ఉద్యాన శాఖాధికారిణి సీహెచ్ జనని చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో మిరప సాగులో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. అలసంద, పిల్లిపెసర, పెసరలాంటి పచ్చిరొట్టపైర్లను వేసి ఉంటే రోటోవేటర్‌తో నేలలో కలియదున్నాలన్నారు. రసాయనిక ఎరువులు మీద ఆధార పడకుండా అందించాల్సిన మొత్తం పోషకాలలో 25 శాతం సేంద్రియ ఎరువుల రూపంలో వేయాలన్నారు. ఎకరానికి పది టన్నుల పశువుల ఎరువు, 25 కిలోల వేప పిండి వేసుకోవాలని సూచించారు. జీవన ఎరువులు, ట్రైకోడెర్మా సూడోమోనాస్ పశువుల ఎరువులతో వాడటం వలన నేల ద్వారా సంక్రమించే ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు వంటి వాటిని నివారించుకోవచ్చన్నారు. నీటి ఎద్దడిని తట్టుకోవడమే కాకుండా వేరు వ్యవస్థ పటిష్ట పరుస్తూ భూమిలో ఉన్న పోషకాలను మొక్కకు అందిస్తుందని చెప్పారు. నాటేటప్పుడు దుక్కిలో యూరియా 65 కిలోలు, సూపర్‌ఫాస్ఫేట్ 150కేజీలు ఎకరం పంటకు ముందు వేసుకోవాల్సి ఉంటుందన్నారు. పది కిలోల జింక్‌సల్ఫేట్ దుక్కిలో వేసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు కె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని బుధవారం నుంచి సీపీఎం చేపట్టే సమరభేరి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పుతుంబాక భవన్ ఆవరణలో సమరభేరి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పూనుకోవడం లేదన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ప్రస్తుతం రూ.1,200 కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. గ్యాస్ పై ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా ఎత్తివేశారని చెప్పారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వటం లేదన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు లక్షలలో ఖాళీగా ఉన్నా భర్తీ చేయడానికి పూనుకోవడం లేదన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ సీపీఎం బుధవారం నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సమరభేరి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ కార్యక్రమాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో విసిగి వేసారి పోయిన ప్రజానీకమంతా సంతకాల సేకరణ, సచివాలయాల వద్ద విజ్ఞాపన పత్రాల సమర్పణ, మండల కార్యాలయాల కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు కట్టా శివ దుర్గారావు, అవ్వారు ప్రసాద్ రావు, పొట్టి సూర్య ప్రకాష్‌రావు, అనంత వెంకట్ నారాయణ, గుంటుపల్లి బాలకృష్ణ ,సెగ్గెం వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు కోట సాయి, డి అమూల్య, డివైఎఫ్ఐ నాయకులు జడ రాజకుమార్, గణేష్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆలయ బ్రహ్మోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వేంచేసి ఉన్న అలివేలుమంగా, పద్మా వతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు స్వామివారికి శ్రీవిశ్వక్సేనారాధన, పుణ్యాహం, ఉత్సవ మూర్తులకు స్నాపన, అలంకరణ, అర్చన, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వినియోగం వంటి కార్యక్రమాలు జరిగినట్లు అర్చకులు శ్రీనివాస శ్రావణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సేవ సమితి ట్రస్ట్ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, ప్రధానకార్యదర్శి అచ్యుత కృష్ణ సుబ్బారావు, కోశాధికారి కాళ్ల రామకోటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.